క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకం పరిశీలన

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని నిత్యాన్న దాన పథకాన్ని ఆలయ ఈఓ చంద్రశేఖర్ అజాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి భోజనం చేశారు. ఆహార పదార్థాలు రుచికరంగా ఉన్నాయా ? అని భక్తులను ప్రశ్నించగా రుచిగా, శుచిగా ఉన్నాయని భక్తులు తెలిపారు. కాగా పప్పు పలచగా ఉండడంతో కాస్తా చిక్కగా వండాలని ఈఓ వంట సిబ్బందికి సూచించారు.

ఒమ్మి రఘురాంకు సత్కారం



రఘురాంను సత్కరిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రనాయుడు

జగ్గంపేట: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ ఇన్ సోషల్ వర్కులో రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి, వివేకానంద విద్యాసంస్థల చైర్మన్ ఒమ్మి రఘురాం గోల్డ్ మెడల్ పొందారు. ఈ మేరకు గురువారం జగ్గంపేటలో రఘురాంను పలువురు సత్కరించారు. వివేకానంద స్కూల్‌లో జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రనాయుడు, ఉపాధ్యాయులు రఘురాంను శాలువా, పూలమాలతో సత్కరించారు. విద్యపై రఘురాం చూపిస్తున్న శ్రద్ధ విద్యార్థులకు ఆదర్శం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కిర్లంపూడిలో రోగులకు కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కిర్లంపూడి: స్థానిక సత్యదేవా కల్యాణ మండపంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి సిబ్బంది రోగులకు కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రోగ్రాం వైద్యాధికారి పద్మదీపిక వెన్నా మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రభుత్వమే ఉచితంగా నేత్ర పరీక్షలు చేయిస్తోందన్నారు. ఈ శిబిరంలో 105 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 53 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసి కాకినాడ శ్రీకిరణ్ కంటి ఆసుపత్రికి పంపించామన్నారు. మరో 43 మందికి కళ్లజోళ్లకు ఎంపిక చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు రాంబాబు నాయక్, అంబటి సన్నీ బెన్సన్, శాంతిరంజని, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పెంటకోట నాగబాబు, బొడ్డేటి గణపతి, సంగన వెంకటేశ్వరరావు, నైదాన బాబ్జి పాల్గొన్నారు.

ఉపాధి పనులు పారదర్శకంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దొరబాబు

గండేపల్లి: గ్రామాల్లో చేపట్టే ఉపాధి హామీ పనులు పారదర్శకంగా ఉండాలని ఎంపీపీ చలగళ్ల దొరబాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సామాజిక ఆడిట్ బృందం సభ్యులు, అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో అవినీతి లేకుండా పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సామాజిక తనిఖీ నిర్వహిస్తోందన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి శుక్రవారం నుంచి నుంచి 13 వరకు గ్రామాల్లో సోషల్ ఆడిట్ జరుగుందని ఎంపీడీఓ రామన్, ఏపీఓ గంగాభవాని తెలిపారు. కార్యక్రమంలో ఈసీ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

గోకవరం: సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు కోరుకొండ ఎస్ఈబీ ఎస్సై సత్యనారాయణ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. అక్రమంగా సారా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు రంపయర్రంపాలెం గ్రామ శివారులో పోలీసులు మాటు వేశారు. అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతున్న గంట శివకృష్ణ, నూకబోయిన మణికంఠ స్వామిని తనిఖీ చేయగా వారి వద్ద 15 లీటర్లు సారా ప్యాకెట్లు లభ్యమయ్యాయి. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

సారాతో వ్యక్తి అరెస్టు

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై సారా తరలిస్తున్న వ్యక్తిని స్థానిక నరేంద్రగిరి వద్ద గురువారం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని లంపకలోవ గ్రామానికి చెందిన జుత్తిక సత్తిబాబు అక్రమంగా బైక్‌పై సారా తరలిస్తుండగా స్థానిక నరేంద్రగిరి వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి బైక్‌తో పాటు పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని స్థానిక కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు పోలీసులు తెలిపారు. స్థానిక ఎస్సై ఎం.పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్షకా..దిగులు లేదిక

- ఈ–క్రాప్ నమోదుతో బహుళ ప్రయోజనాలు
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- గ్రామాల్లో జోరుగా నమోదు ప్రక్రియ

నియోజకవర్గంలో సాగు వివరాలు

మండలం	పంటల సాగు (ఎకరాల్లో)
కిర్లంపూడి	10864
గోకవరం	1353
జగ్గంపేట	10280
గండేపల్లి	8710
మొత్తం	31,207



కిర్లంపూడిలో సాగు చేసిన వరి పంట



ముక్కొల్లులో ఈ–పంట నమోదు చేస్తున్న వీఏఏ

కిర్లంపూడి: ఆరుగాలం శ్రమించే రైతులకు విత్తనం వేసిన నాటి నుంచి పంట చేతికి అందే వరకూ అష్టకష్టాలు, ఆందోళనలు తప్పవు. అతివృష్టి, అనావృష్టి కారణాలతో రైతులు నష్టాల బారిన పడుతూనే ఉంటారు. ఇటువంటి కష్టనష్టాలకు చెక్ పెట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ–పంట నమోదు కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. సాగు విస్తీర్ణం, రైతులు ఏయే పంటలు సాగు చేశారు అనే వివరాలను సేకరించి ఈ–పంట నమోదు చేస్తారు.

లాభాలెన్నో

ఈ– క్రాప్ నమోదుతో రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయి. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే ఈ– క్రాప్ నమోదు చేసిన రైతులకు నష్ట పరిహారం వస్తుంది. అలాగే పంటల బీమా, రాయితీలు అందుతాయి. ఈ–క్రాప్ నమోదు చేయని రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తించవు. సెప్టెంబర్ 15 లోగా రైతులు ఈ–పంట నమోదు చేసుకోవాల్సి ఉంది.

క్షేత్ర స్థాయిలో వివరాల సేకరణ

ఏటా ఈ–పంట నమోదుకు సంబంధించి రెండు సార్లు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తారు. గతంలో ఈ–పంట నమోదు వ్యవసాయాధికారులు, విస్తరణ అధికారులు చేసేవారు. ప్రస్తుతం వీఏఏలు, వీహెచ్ఏలు, వీఆర్ఏలు గ్రామాల్లో రైతుల భూముల వద్దకు వెళ్లి సర్వే నంబర్లు, ఎంత విస్తీర్ణంలో ఏయే పంటలు సాగు చేస్తున్నారనే వివరాలకు సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. రైతుల ఆధార్ కార్డు నంబరు, ఫోన్ నంబర్లు, ఎంత విస్తీర్ణంలో ఏయే పంటలు సాగు చేస్తున్నారనే వివరాలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. రైతుల ఆధార్ కార్డు నంబర్ అలాగే ఫోన్ నంబరును తీసుకుంటారు. ఈ వివరాలను మండల, జిల్లా స్థాయిలో అధికారులు పరిశీలించిన తరువాత రాష్ట్ర కమిషనర్ కార్యలయానికి పంపిస్తారు.

రైతులకు ఎంతో మేలు



ఈ–పంట నమోదుతో రైతులు ఎంతో మేలు కలుగుతోంది. అధికారుల సూచనల మేరకు ఈ–పంట నమోదు చేసుకుంటున్నాం. ఈ–పంట నమోదు చేయించుకుంటే ఎటువంటి విపత్తులు ఎదురైనా ప్రభుత్వం నుంచి పరిహారం అందుకునే అవకాశం ఉంటుంది. రాయితీపై విత్తనాలు, ఎరువులను అందజేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుకు అన్ని విధాలా మేలు జరుగుతోంది.

– వాసిరెడ్డి శ్రీను, రైతు, ముక్కొల్లు

రైతులు సహకరించాలి



ఈ–పంట నమోదు చేసుకోవడం వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయి. ప్రభుత్వ పథకాలకు ఈ–పంట నమోదు తప్పనిసరి. రైతులు ఏయే పంటలను సాగు చేస్తున్నారనే వివరాలు సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. ఈ–పంట నమోదుకు రైతులు సహకరించాలి. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.

– జోకా అమృత, కిర్లంపూడి మండల వ్యవసాయాధికారి

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనర్సాపురం పీఠాధిపతి స్వామి సూర్యానంద

ఏలేశ్వరం: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని లక్ష్మీనర్సాపురం పీఠాధిపతి స్వామిసూర్యానంద అన్నారు. మండలంలోని సిరిపురం చిద్గగనందా గీతాశ్రమంలో శ్రావణపౌర్ణమిని పురస్కరించుకుని గురువారం ఆధ్యాత్మిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంచుకోవాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా హిందూ ధర్మానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. హిందూ ధర్మాన్ని ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. ప్రస్తుతం సమాజంలో ప్రజలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, వీరు ప్రశాంతంగా ఉండేందుకు ఆధ్యాత్మిక భావం ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో యల్లపు సూర్యనారాయణ, రాసంశెట్టి రాజా, బర్రే కోటేశ్వరరావు, పాలమూరి పెదకాపు, ఆకుల నూకపతిరావు, మజ్జూరి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆహా క్యాంటీన్ ప్రారంభం



ఏలేశ్వరంలో ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులకు తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యమని ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మోప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌కు గురువారం వారు ప్రారంభించారు. ఇక్కడ రోగులు, వారి బంధువులకు తక్కువ అల్పాహారం, భోజనం అందిస్తారని తెలిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో పేదలకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన మద్దుల నరసింహమూర్తి ప్రథమ వర్ధంతి సందర్భంగా అతని కుమారుడు మద్దుల శ్రీను, దేవి దంపతులు సుమారు వంద మందికి దుప్పట్లు అందజేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు.

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్



తుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖర్లు

తుని: ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన కార్డ్ ప్రైమ్ 2.0 విధానాన్ని నిరసిస్తూ తుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట గురువారం దస్తావేజు లేఖర్లు నిరసన తెలిపారు. రాష్ట్ర దస్తావేజు లేఖర్లు సంఘం ఇచ్చిన పిలుపు మేరకు పెన్‌డౌన్ చేశామని తుని శాఖ అధ్యక్షుడు మంగా పాల్ జీవరత్నం తెలిపారు. ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన విధానంతో దస్తావేజు లేఖర్లు ఉపాధి కోల్పోతారన్నారు. ప్రభుత్వం పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు. దస్తావేజు లేఖర్లు మేడిది భానుమూర్తి, బొడ్డేటి ప్రసాద్, చోడిశెట్టి రమణబాబు, జోగా గణేష్, దొడ్డి చిన్న, కొత్తూరు శేఖర్, సీహెచ్.సుబ్బరాజు, మేడిది నాగేశ్వరరావు అల్లం ప్రసాద్ పాల్గొన్నారు.

రెండోరోజూ కొనసాగిన దస్తావేజు లేఖర్ల నిరసన

ప్రత్తిపాడు: రిజిస్ట్రేషన్ల విధానంలో ప్రైమ్ 2.0 విధానానికి వ్యతిరేకంగా ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు చేపట్టిన నిరసన రెండోరోజు గురువారం కొనసాగింది. ప్రైమ్ 2.0 విధానంతో దస్తావేజు లేఖర్లు, సహాయకులు, డాక్యుమెంట్ ఆపరేటర్లు, స్టాంపు వెండర్లు ఉపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్లలో పాత విధానాన్ని అమలు చేయాలంటూ నినాదాలు చేశారు. కాగా దస్తావేజు లేఖర్ల నిరసన శిబిరాన్ని ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, సీఐటీయూ నాయకుడు రొంగల ఈశ్వరరావు తదితరులు సందర్శించి, ఆందోళనకు మద్దతు ప్రకటించారు.

ముగిసిన వనదుర్గ అమ్మవారి జాతర



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ, ప్రత్యంగిర హోమాలు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై ఆరు రోజులుగా నిర్వహిస్తున్న వనదుర్గ అమ్మవారి శ్రావణ మాస జాతర మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు వనదుర్గ అమ్మవారు ఐదు శిరస్సులతో గాయత్రీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యంగిర, చండీహోమాలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పండితులు అమ్మవారికి నవగ్రహజపాలు, శ్రీచక్రార్చన, పురుష, శ్రీసూక్త పారాయణలు, మూలమంత్ర జపాలు, సూర్యనమస్కారాలు, సప్తశతీ పారాయణలు, బాల, కన్య, సువాసిని పూజలు నిర్వహించారు. అనంతరం చండీ, ప్రత్యంగిర హోమాలు ప్రారంభించారు. 11 గంటలకు ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ పాల్గొన్నారు.

నేడు వనదుర్గ అమ్మవారికి చండీహోమం

శ్రావణ శుక్రవారం సందర్భంగా వనదుర్గ అమ్మవారికి ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు చండీహోమం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆసక్తి గల భక్తులు రూ.558తో టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొనవచ్చన్నారు.

ఘనంగా సుదర్శన, మహాచండీ హోమాలు



ఎస్.అన్నవరంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న పండితులు

తుని రూరల్: శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం లోవ దేవస్థానంలో మహాచండీ హోమం, ఎస్.అన్నవరంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు. తలుపులమ్మతల్లికి ప్రీతికరమైన మహాచండీ హోమాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎస్.అన్నవరంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సుదర్శన మూర్తి ప్రతిమను ఆలయం చుట్టూ ఊరేగించి అర్చకులు వైభవోపేతంగా సుదర్శన హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలను నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

జగనన్న పాలవెల్లువపై అవగాహన



కేతఈ చిన్నయ్యపాలెం సదస్సులో మాట్లాడుతున్న వెటర్నరీ డాక్టర్ ప్రదీప్‌కుమార్

తుని రూరల్: అధిక పాల దిగుబడి సాధించడం ద్వారా పాడి రైతులు మరింత లాభాలు పొందవచ్చని తేటగుంట పశు వైద్యాధికారి డాక్టర్ డి.గోపి అన్నారు. ఆత్మ, అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో గురువారం హెచ్.కొత్తూరు, హంసవర, వల్లూరు గ్రామాల్లో జగనన్న పాల వెల్లువపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి గోపి మాట్లాడుతూ నాణ్యత గల అధిక పాల ఉత్పత్తి, పాలలో వెన్నశాతం పెరుగుదల, పశువులకు అంటువ్యాధులు సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. నాణ్యత, వెన్నశాతాన్ని బట్టి అమూల్ డెయిరీ రైతులకు మంచి గిట్టుబాటు ధర చెల్లిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కోటనందూరు: మండలంలోని కొత్తకొట్టాం, కేతఈ చిన్నయ్యపాలెం గ్రామాల్లో గురువారం జగనన్న పాల వెల్లువ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు స్వచ్ఛమైన పాల ఉత్పత్తిపై సూచనలు, సలహాలు ఇచ్చారు. పాలలో వెన్న, ఎస్ఎన్ఎఫ్ శాతాన్ని పెంచుట, అధిక పాలదిగుబడి, పశువులకు అంటువ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆత్మ, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ఏలేశ్వరంలో గడపగడపకూ మన ప్రభుత్వం



ఏలేశ్వరంలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. ఏలేశ్వరం 4వ సచివాలయం పరిధిలోని 15వ వార్డులో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్లలో 99 శాతం ఎన్నికల హామీలను అమలు చేశారన్నారు. అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పలు పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, సుంకర రాంబాబు, బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్, కాకాడ నాగేశ్వరరావు, సామంతుల చిన్నారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు మృతి



గంట్ల సత్యనారాయణ (ఫైల్)

తుని: చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు గంట్ల సత్యనారాయణ (48) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. తుని మండలం దొండవాకకు చెందిన సత్యనారాయణ పెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్స్ వ్యాపారం చేస్తున్నారు. ఆయన తుని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా పని చేశారు. తుని లయన్స్ క్లబ్‌లో సభ్యుడి నుంచి వివిధ పదవులు నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున స్వల్ప అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు తునిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు కాకినాడకు రిఫర్ చేశారు. కాకినాడకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందారు. సత్యనారాయణ మృతి చాంబర్‌కు తీరని లోటని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బారాయుడు అన్నారు. ఆయన మృతికి సంతాపంగా పట్టణంలోని అన్ని వ్యాపార సంస్థలను మూసివేశారు. పలు రాజకీయ పార్టీల నాయకులు, సేవా సంస్థల ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

ఎరువుల యాజమాన్యం కీలకం



కొత్తకొట్టాంలో చెరకు పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కోటనందూరు: ఖరీఫ్ పంటల సాగులో ఆశించిన ఫలితాలు సాధించాలంటే ఎరువులు, నీటి యాజమాన్యం ఎంతో కీలకమని పెద్దాపురం ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. మండలంలోని కేఏ మల్లవరం, పాతకొట్టాం, కేతఈ చిన్నయ్యపాలెం, కొత్తకొట్టాం తదితర గ్రామాల్లో సాగు చేసిన వరి, చెరకు, కూరగాయల పంటలను గురువారం మండల ఏఓ కేజే చంద్రశేఖర్, వ్యవసాయ శాఖ క్షేత్ర సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. పంటలకు ఆశించే వివిధ రకాల తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ మండలంలో వర్షాలు లేక వరినాట్లు ఆలస్యమయ్యాయన్నారు. పంటల్లో చీడపీడల ఉధృతి తక్కువగానే ఉన్నప్పటికీ వరిలో ఎండాకు తెలుగును గర్తించామన్నారు. నత్రజని ఎరువు తగ్గించి నీటి యాజమాన్యం పాటించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ కేవీ శివకుమారి, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

పథకాల అమలులో దేశానికే ఆదర్శం

మాజీ మంత్రి తోట నరసింహం



ఆత్మీయ సమవేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

జగ్గంపేట: సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. మండలంలోని రామవరంలో గురువారం రావుల గణేష్ రాజా, గుర్రం మహాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. దివంతగ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మంజూరు చేసిన ఎత్తిపోతల పథకం కారణంగా ప్రస్తుతం మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గం సస్యశ్యామలంగా ఉందన్నారు. వైఎస్ బాటలోనే ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు అత్తులూరి సాయిబాబు, రామకుర్తి మూర్తి, పలికెల గంగరాజు, తోట రాంజీ, తోట అయ్యన్న, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓనమ్ వేడుకలు




ఓనమ్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థలో గురువారం ఓనమ్ వేడుకలు ఘనంగా నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ భానుమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా కేరళ సాంప్రదాయ పద్ధతిలో వేసిన ముగ్గులు, విద్యార్థుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వివిధ రాష్ట్రాల సంప్రదాయాలు, పండుగలను విద్యార్థులకు తెలియజేసేందుకు ఓనమ్ నిర్వహించినట్టు పిన్సిపాల్ తెలిపారు. అకడమిక్ ఇన్‌చార్జి శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనుల పరిశీలన

గోకవరం: యర్రంపాలెంలో జరుగుతున్న జల్‌జీవన్ మిషన్ పనులను గురువారం మండల సచివాలయాల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు పాటి రాంబాబు పరిశీలించారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తారన్నారు. కార్యక్రమంలో కర్రి సురారెడ్డి, చింతల అనిల్, ఎంపీటీసీ అసిరమ్మ, ఏసురత్నం పాల్గొన్నారు.

వైభవంగా రక్షాబంధన్



శంఖవరంలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు



పెద్దిపాలెంలో అన్నకు రాఖీ కడుతున్న చెల్లెళ్లు

తుని: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకను తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ పాఠశాలల్లోనూ రక్షా బంధన్ వేడుకలు నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థలు, ఈశ్వరీయ బ్రహ్మకుమారీలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. రాఖీలు కట్టేందుకు వచ్చే అక్కచెల్లెమ్మలతో ఆర్టీసీ బస్సులు రద్దీగా దర్శనమిచ్చాయి.

ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీస్

శంఖవరం: రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌కు ఓం శాంతి బ్రహ్మకుమారీలు రాఖీ కట్టారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండగను ప్రతిఒక్కరూ ఆనందంగా జరుపుకోవడం శుభపరిణామని ఎమ్మెల్యే అన్నారు. పలువురు బ్రహ్మకుమారీస్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలో రాఖీ పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. అన్నదమ్ములకు అక్కాచెల్లెళ్లు రాఖీలు కట్టి మిఠాయి తినిపించి ఆశీస్సులు తీసుకున్నారు. మండలంలోని ధర్మవరం, ఒమ్మంగి, రాచపల్లి, గజ్జనపూడి, పెద్దిపాలెం, ఉత్తరకంచి తదితర గ్రామాల్లో అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. సోదరులు తమకు తోచిన కానుకలను అక్కాచెల్లెళ్లకు అందజేశారు.

తొండంగి: మండలంలోని రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. బాలికలు, యువతులు తమ సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి ఆశీస్సులు పొందారు. తొండంగి రామలింగేశ్వరాలయం, ఒంటిమామిడి శివాలయం, దానవాయిపేట వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు సహచర విద్యార్థులకు రాఖీలు కట్టి వేడుకలు జరుపుకున్నారు.

రౌతులపూడి: ఈ ఏడాది రాఖీ పౌర్ణమి వేడుకలు రెండు రోజులు నిర్వహించగా రెండో రోజు గురువారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు పౌర్ణమి గడియలు ఉండటంతో మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టారు. అన్నదమ్ములు తమ అక్కచెల్లెమ్మలను దీవించి కానుకలు ఇచ్చారు. కాగా తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గండేపల్లి: మండల వ్యాప్తంగా గురువారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. అక్కాచెల్లెలు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టారు.